జలమయమైన నగరం

సోమవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి హనుమకొండ, వరంగల్ నగరమంతా జలమయమైంది. కుంటలు, చెరువులు నిండడంతో నీరంతా రోడ్లపైకి చేరింది. ప్రధాన రోడ్లపై నీటి ప్రవాహం ప్రవహించడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డ్రెయినేజీలు నిండి ఇళ్లలోకి మోకాళ్ల లోతు వరకు నీరు చేరడంతో బియ్యం, ఇతర వస్తువులు నీటిలో తడిసి ముద్దయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం వరకు నీటి ప్రవాహం తగ్గలేదు. దీంతో నగరవాసులు నానా తంటాలు పడ్డారు. వృద్ధులు, మహిళలు చాలా ఇబ్బంది పడ్డారు. పలు వాహనాలు నీటిలో మునిగి పనికిరాకుండా పోయాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్


వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిని ముంచెత్తిన వరదనీరు


హనుమకొండ టీటీడీ కల్యాణ మండపం- పబ్లిక్‌గార్డెన్ రోడ్డులో వర్షపు నీరు


హంటర్‌రోడ్డులో నీటిలో మునిగిన కారు, బాంబే కాలనీలో నీటిలో ఉన్న ద్విచక్రవాహనం


మిల్స్‌కాలనీ పీఎస్ ఎదుట నీటిలో వెళ్తున్న ఆటో


ఉధృతంగా ప్రవహిస్తున్న బొందివాగు


భద్రకాళి ఆలయ రోడ్డులోని సరస్వతి టెంపుల్ స్ట్రీట్‌లో నిలిచిన వరద నీరు


మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ సమీపంలో ఓ ఇంట్లో నీట మునిగిన వస్తు సామగ్రి


వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద ప్రవహిస్తున్న వరద నీటిలో వాహనదారులు


చెరువులా తలపిస్తున్న హనుమకొండ బస్టాండ్

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 13న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబ రెడ్డి తెలిపారు. ఈద్గా, పోచమ్మకుంట, శ్రీనగర్ కాలనీ, నయీంనగర్, విద్యానగర్, ప్రెసిడెన్సీ స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పరామర్శ

మడికొండ: కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన వస్కుల వెంకటస్వామి(45) ఆటోడ్రైవర్ అనారోగ్యంతో మంగళవారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట స్థానిక నాయకులు శంకర్, మాజీ కార్పొరేటర్ రాజుయాదవ్, ఉన్నారు.

రెవెన్యూశాఖకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలి

న్యూశాయంపేట : పెండింగ్ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటున్నామని, రెవెన్యూ శాఖకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సీసీఎల్ఏ అసిస్టెంట్ సెక్రటరీ వి.లచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీజీఆర్ఎస్ఏ) నాయకులు లచ్చిరెడ్డిని హైదరాబాద్‌లోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి ఫొటోఫ్రేమ్‌ను అందించారు. కార్యక్రమంలో స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కోమాండ్ల రాజు, రవి, కరుణాకర్, యాదేశ్ పాల్గొన్నారు.

మెగాజాబ్ మేళాకు అనూహ్య స్పందన

రామన్నపేట : ఆర్యవైశ్య మహాసభ హనుమకొండ, వరంగల్ జిల్లాల ప్రతినిధులు మంగళవారం నగరంలోని అబ్బూస్ ఫంక్షన్ హాల్‌లో సంయుక్తంగా నిర్వహించిన మెగా జాబ్ మేళాకు అనూహ్య స్పందన లభించింది. ఈ మేళాలో 43 కంపెనీలకు చెందిన హెచ్ఆర్‌లు హాజరు కాగా 1500 మంది అభ్యర్థులు తరలివచ్చారు. మహాసభ జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ జాబ్‌మేళా నిర్వహణను విజయవంతం చేసేందుకు ఎంతో మంది ఆర్యవైశ్య ప్రతినిధుల కృషి ఉందని పేర్కొన్నారు. ముందుగా ఈ జాబ్‌మేళాకు క్యూ ఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్‌లు చేసుకోగా స్వయంగా జాబ్‌మేళా సమయంలో వచ్చిన అభ్యర్థులకు సైతం అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు వేదిక మీదనే అపాయింట్‌మెంట్ లెటర్స్ అందించినట్లు తెలిపారు.

ముగిసిన సంకటహర చతుర్థి పూజలు

కాజీపేట: కాజీపేట స్వయంభు శ్రీశ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో సంకటహర చతుర్థిని పురస్కరించుకుని మంగళవారం 58 లీటర్ల తేనెతో స్వామివారికి ఘనంగా అభిషేకం నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు అయినవోలు రాధాకృష్ణ శర్మ తేనెతో అభిషేకం, అర్చనలు, అలంకరణ పూజలు నిర్వహించారు. పరిపాలన అధికారి సాయికృష్ణ శర్మ గణపతి హోమం నిర్వహించారు. భక్తులందరికీ మహాన్నదానం చేశారు.

వినాశనకర విధానాలతో దూరమవుతున్న విద్య, వైద్యం

నయీంనగర్ : పాలకుల వినాశనకర విధానాలతో ప్రజల అభివృద్ధికి ఉచితంగా అందించాల్సిన విద్య, వైద్యం కార్పొరేట్ చేతుల్లో బందీగా మారి పేద ప్రజలకు అందని ద్రాక్షగా మారిందని తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక రాష్ట్ర కన్వీనర్ ప్రొ.వినాయక్ రెడ్డి, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. మంగళవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ శతజయంతి వార్షికోత్సవాల్లో భాగంగా విద్య-వైద్యం, ప్రభుత్వరంగం అనే అంశంపై రాష్ట్ర సదస్సు ఏఐఎఫ్‌డీవై, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కక్ర రాజిరెడ్డి, పల్లె మురళి అధ్యక్షతన హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఓంకార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

అర్హులైన మహిళలను సంఘాల్లో చేర్పించాలి


సదస్సులో మాట్లాడుతున్న డీఆర్డీఓ శ్రీను

హసన్‌పర్తి: అర్హులైన ప్రతీ మహిళను మహిళా సంఘంలో సభ్యులుగా చేర్పించాలని డీఆర్డీఓ మేన శ్రీను అన్నారు. మండల కేంద్రంలోని సంస్కృతీ విహార్‌లో మండల సెర్ప్ సిబ్బంది అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. సమావేశానికి డీఆర్‌డీఓ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అర్హులైన మహిళలు, వితంతువులు, కిశోర బాలికలు, దివ్యాంగులను చేర్పించడానికి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అదనపు డీఆర్‌డీఓ బొజ్జ వెంకటేశ్వర్లు, శాంతి మండల సమాఖ్య అధ్యక్షురాలు స్వప్న పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు


న్యూశాయంపేట : ఎస్ఆర్‌నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

న్యూశాయంపేట : భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు అన్నారు. మంగళవారం నియోజకవర్గ పరిధి గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ ఎస్ఆర్ నగర్‌లో క్షేత్రస్థాయిలో పర్యటించి అకాల వర్షానికి లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. జలమయమైన ఇళ్లను సందర్శించి ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షపు నీరు బయటకు వెళ్లే స్ట్రాం వాటర్ డ్రెయిన్‌లు ఇరుకుగా ఉండటంతో నీటి ప్రవాహంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. నాలాలను విస్తరించడానికి పనులు కొనసాగుతున్నాయన్నారు. లోతట్టు ప్రాంతాల్లో సత్వరమే చర్యలు చేపడతామన్నారు. సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు కేటాయింపచేసి వచ్చే వర్షాకాలం నాటికి చుక్క నీరు నిల్వ ఉండకుండా చేస్తానని ప్రజలు హామీ ఇచ్చారు. ఆయన వెంట స్థానిక కార్పొరేటర్ తూర్పాటి సులోచనా, సారయ్య, డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతెయాజ్, ఉన్నారు.


ఖిలావరంగల్ : మైసయ్యనగర్‌లో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు

అధైర్యపడొద్దు అండగా ఉంటాం

ఖిలా వరంగల్: లోతట్టు ప్రాంతాల ప్రజలు అధైర్యపడొద్దు నేనున్నానని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు భరోసా ఇచ్చారు. మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షం కారణంగా వరంగల్ రైల్వేగేట్ ప్రాంతం ఖిలావరంగల్ పడమరకోట, లేనినగర్, ఎస్ఆర్ఆర్ తోట, శివనగర్, బీకే నగర్, లక్ష్మీనగర్, మైసయ్య నగర్, శివవనగర్ ప్రాంతాల్లో వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్‌రాజు, మీసాల ప్రకాశ్, కొత్తపెల్లి శ్రీనివాస్, కార్పొరేటర్లుతో కలిసి ఆయన పర్యటించారు. కొండా మురళీధర్‌రావు మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అత్యవసరమైతే తప్ప బయటికి రాకూడదని సూచించారు. ఆయన వెంట కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్,దామోదర్ యాదవ్, ఉన్నారు అలాగే బీజేపీ నేత చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు మంగళవారం వరంగల్ తూర్పులోని ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. బీజేపీ నేతలు నర్సింగం, రవీందర్ పాల్గొన్నారు.

మోదీ రాజీనామా చేయాలి

- వీసీకే రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్

హన్మకొండ: దొంగ నోట్లతో గద్దెనెక్కిన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వం వెంటనే రాజీనామా చేసి దిగిపోవాలని వీసీకే రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఓట్ల స్కాం బాధ్యులైన ఎన్నికల కమిషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హనుమకొండలోని అదాలత్ కూడలిలో టీఎస్ఎఫ్, పీఎస్ఎఫ్, వీసీకే, ఎఎల్‌పీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ బయటపెట్టిన ఓట్ల దొంగతనం మీద సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఇచ్చిన ఓటు హక్కును బీజేపీ దొంగతనం చేస్తుందని, రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి చేస్తున్న పోరాటానికి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో వరంగల్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు జీవన్, ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్, ఆయా సంఘాల నాయకులు జై సూర్య, రంజిత్, రవి, అభిలాష్, శ్రీను, మణితేజ, బన్నీ, అనిల్, అంబేద్కర్, పద్మ, త్రివేణి పాల్గొన్నారు.


నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల పోరుబాట


వరంగల్-2 డిపో ఎదుట ధర్నా చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

హన్మకొండ : టీజీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు పోరుబాట పట్టారు. ఏళ్ల గడుస్తున్నా పదవీ విరమణ ప్రయోజనాలు చెల్లించకపోవడంతో విశ్రాంతి తీసుకోవాల్సిన ఉద్యోగులు ఉద్యమబాట పట్టారు. 2017 వేతన సవరణ బకాయిలతో పాటు పదవీ విరమణ పొందిన ప్రయోజనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వరంగల్ రీజియన్‌లోని వరంగల్-1, 2, హనుమకొండ, పరకాల, భూపాలపల్లి, మహబూబాబాద్, నర్సంపేట, తొర్రూరు, జనగామ డిపోల వద్ద రిటైర్డ్ ఉద్యోగులు ధర్నా చేశారు. హనుమకొండలోని వరంగల్ రీజియన్ కార్యాలయంలో ఆర్ఎం అందుబాటులో లేకపోవడంతో కార్యాలయం ఉద్యోగికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రిటైర్ ఉద్యోగులు మాట్లాడుతూ రిటైరై ఏళ్ల గడుస్తున్నా రిటైర్‌మెంట్ ప్రయోజనాలు చెల్లించకుండా తమను యాజమాన్యం ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. దాసరి సర్వేశం, సిహెచ్.వి రెడ్డి, వి.అశోక్, ఎస్.మధుసూదన్, సి.రవి, కె.ఎస్.రెడ్డి, ఎంఆర్‌కె.రెడ్డి, ఎం.ప్రసాద్, ఓం ప్రకాశ్, కె.వై.రెడ్డి, పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ అంబులెన్స్ తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ


అంబులెన్స్‌లో రిజిస్టర్ తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ అప్పయ్య

హన్మకొండ అర్బన్ : హనుమకొండ రెడ్‌క్రాస్ కాంప్లెక్‌లోని అంబులెన్స్‌ను హనుమకొండ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్ వర్కింగ్ కండిషన్ వివరాలు, సేవలు, తదితర వివరాలను సిబ్బంది అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పీఎం నజీరుద్దీన్, ఈఎంఈ శ్రీనివాస్, ఈఎంటీ చైతన్య, పైలెట్ అశోక్, తదితరులు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి


సమ్మెలో పాల్గొన్న కేఎంసీ పారిశుద్ధ్య కార్మికులు

ఎంజీఎం : పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ కాకతీయ వైద్యకళాశాల మెన్స్ అండ్ ఉమెన్స్ హాస్టల్‌లో పనిచేస్తున్న 86 మంది పారిశుద్ధ్య కార్మికులు మంగళవారం తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నగరంలోని ఏకశిలా పార్కు ఎదుట నిరవధిక సమ్మెకు దిగారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా తమ సమస్యలు తీరడం లేదని వాపోయారు. 8 నెలలుగా పెండింగ్ వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ కుటుంబ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. 18 నెలలుగా ఎన్నో ఇబ్బందులు ఉన్న వైద్య విద్యార్థులకు శ్రేయస్సు దృష్ట్యా ఓపికతో వేచి చూశామని అధికారులు మా సమస్యలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో సమ్మెకు దిగామని తెలిపారు.

కంపు.. కంపుగా కేఎంసీ హాస్టల్ భవనాలు

కేఎంసీ శానిటరీ కార్మికుల సమ్మె కారణంగా వైద్య విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమ్మె కారణంగా మెన్స్, ఉమెన్స్ హాస్టళ్లు పూర్తిగా చెత్తాచెదారంతో నిండి అసౌకర్యంగా మారాయి. వాష్ రూములు చాలా మురికిగా మారి కంపుకొడుతున్నాయి. ఇప్పటికే అనేక మంది విద్యార్థులు జ్వరాలు, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నా రు. ఈ పరిస్థితి విద్యార్థుల ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదంగా మారనుంది. కార్మికుల సమస్యపై చర్య తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

సంక్షిప్త సమాచారం

తీజ్ వేడుకలు ప్రారంభం

హన్మకొండ : హనుమకొండ అశోక కాలనీలో గిరిజన భవన్‌లో తీజ్ వేడుకలు ప్రారంభమయ్యాయి. గోర్ బంజార తీజ్ ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మహిళలు, యువతులు గోధుమలు నానబెట్టి తీజ్ ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ 9 రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కొడకండ్ల మాజీ జెడ్పీటీసీ కేలోతు సత్తెమ్మ, భూపాలపల్లి అడిషనల్ ఎస్పీ సతీమణి రమ నరేష్, గ్రేటర్ వరంగల్ గోర్ బంజారా తీజ్ ఉత్సవ నిర్వాహక బాధ్యులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు హెల్త్ కార్డుల పంపిణీ

వరంగల్ లీగల్ : వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాల్‌లో రాష్ట ప్రభుత్వం ప్రవేశపెట్టిన న్యాయవాదుల ఆరోగ్య బీమా పథకం కింద హెల్త్ కార్డులను పంపిణీ చేసినట్లు వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వలుస సుధీర్, డి.రమాకాంత్ తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానానికి కట్టుబడి న్యాయవాదుల రక్షణచట్టాన్ని ఏర్పాటు చేసి మరో రూ.100 కోట్లు న్యాయవాదుల సంక్షేమానికి ఇవ్వాలన్నారు.

మద్దతు ధరకు మంగళం పాడేందుకే పీడీపీఎస్ విధానం

రామన్నపేట/ఖిలావరంగల్ : మద్దతు ధరకు మంగళం పాడేందుకే కేంద్ర ప్రభుత్వం పీడీపీఎస్ విధానాన్ని పత్తిపంట కొనుగోలులో అమలు చేయాలని చూస్తున్న విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ (ఏఐకేఎఫ్) జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్‌రావు అన్నారు. మంగళవారం రైతు సంఘం నాయకులు ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చందర్‌రావు మాట్లాడుతూ గతంలో గుజరాత్, మధ్యప్రదేశ్‌ల్లో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేసి, ప్రభుత్వాలకు చెడ్డ పేరు వచ్చినందున రద్దు చేసిన విషయం గుర్తుచేశారు. కార్యక్రమంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సింగతి సాంబయ్య, తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బాషిపాక రమేష్, జిల్లా నాయకులు బల్సుకూరి నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లోని రామకృష్ణ స్కూల్, డీజిల్ కాలనీలోని శిశువిద్యావిహార్ స్కూల్‌లో మంగళవారం రైల్వే ఇనిస్టిట్యూట్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు లెమన్ అండ్ స్పూన్ రేస్, రన్నింగ్ రేస్, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించినట్లు రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ కోశాధికారి గిరిమిట్ల రాజేశ్వర్‌రావు తెలిపారు. 80 మంది విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా వివిధ రకాలైన పోటీల్లో పాల్గొని ఆడారు.

అనిశెట్టి రజిత మృతికి పలువురి సంతాపం

హన్మకొండ : ప్రముఖ కవి, ప్రజాస్వామిక రచయితల వేదిక జాతీయ నాయకురాలు అనిశెట్టి రజిత మృతి పట్ల దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్, కేతిరెడ్డి వాసుదేవరెడ్డి సంతాపం ప్రకటించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తన కలం ద్వారా చైతన్యం నింపారన్నారు. అదేవిధంగా మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.తిరుపతయ్య, ఉపాధ్యక్షుడు బాదవత్ రాజు సంతాపం ప్రకటించారు.

బాధితులకు టిఫిన్స్, దుప్పట్ల పంపిణీ

ఖిలా వరంగల్ : నగరంలోని 34, 35 డివిజన్లు మైసయ్య నగర్, పాడిమల్లారెడ్డి, శివనగర్ లోతట్టు ప్రాంతాల ప్రజలు పూర్తిగా వరద ముంపులో చిక్కుకున్నారు. సామాజిక వేత్తలు మేరుగు అశోక్, గడ్డం రవి ఆధ్వర్యంలో మంగళవారం ముంపు బాధితులకు భోజనం, టిఫిన్స్, దుప్పట్లను పంపిణీ చేసి తమ సేవాదాతృత్వాన్ని చాటుకున్నారు.

సెప్టెంబర్ 1న పీఆర్‌టీయూ మహాధర్నా

విద్యారణ్యపురి : చలో హైదరాబాద్ సెప్టెంబర్ 1న సీపీఎస్ రద్దుకోసం ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయూటీఎస్) ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద తిరుపతిరెడ్డి, జనరల్ సెక్రటరీ ఫలితశ్రీహరి పిలుపునిచ్చారు. ఈమేరకు ఇందుకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం సాయంత్రం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీజీఈ జాక్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, కార్యదర్శి బైరి సోమయ్య, రాష్ట్ర , జిల్లా, మండల బాధ్యులు శ్రీనివాస్, ఉపేందర్‌రెడ్డి, కోమల్‌రెడ్డి, రామన్న, మహిపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఈఆర్ఓ కార్యాలయంలోకి నీరు



హన్మకొండ: బాలసముద్రంలోని హనుమకొండ రూరల్ విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలోకి వరద నీరు చేరింది. సోమవారం రాత్రి కురిసిన అతి భారీ వర్షానికి ఈఆర్ఓ కార్యాలయంలోకి వరదనీరు చేరడంతో ఫర్నీచర్ పాడైపోయింది. ఈ నెల 7న రాత్రి కురిసిన భారీ వర్షానికి ఇదే కార్యాలయంలోని బిల్ కౌంటర్‌లో నడుం ఎత్తు వరకు నీరు చేరడంతో కంప్యూటర్, ఇతర వస్తువులు పాడయ్యాయి. దీంతో బిల్ కౌంటర్‌ను ఇదే ఆవరణలోని హనుమకొండ చౌరస్తా సెక్షన్ కార్యాలయంలోకి మార్చారు.

ఒకేషనల్ కాలేజీ ఆవరణలో చేరిన నీరు

విద్యారణ్యపురి: భారీ వర్షాల నేపథ్యంలో హనుమకొండలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజీలో ఆవరణ అంతా నీటితో నిండిపోయింది. దీంతో మంగళవారం కళాశాలకు వచ్చిన విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు పడ్డారు. నీరు బయటకు వెళ్లకపోవడంతో ఆవరణ కొంతమేర లోతట్టుగా ఉండటంతో నీరు అంతా నిలిచిపోయింది. చెరువు కుంటను తలపించింది.

ముంపు ప్రాంతాల్లో సీపీఎం బృందం పర్యటన

రామన్నపేట : వరంగల్ నగరంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఇళ్లలోకి నీరు చేరి భారీగా నష్టపోయిన రామన్నపేట, శివనగర్, బీఆర్ నగర్, మైసయ్యనగర్ ప్రాంతాల్లో సీపీఎం బృందం సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సింగారపు బాబు బాధిత కుటుంబ సభ్యులను

గ్రంథాలయ సేవలను వినియోగించుకోవాలి

కేయూ క్యాంపస్ : గ్రంథాలయ సేవలను విద్యార్థులు వినియోగించుకోవాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి కోరారు. కేయూ లైబ్రరీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్, తెలంగాణా గ్రంథాలయ సంస్థ వరంగల్‌శాఖ, కేయూ కేంద్ర గ్రంథాలయం, లైబ్రరీ సైన్స్ డిపార్టుమెంట్ సంయుక్తంగా యూనివర్సిటీలోని గ్రంథాలయంలో నిర్వహించిన లైబ్రేరియన్స్ డే వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర గ్రంథాలయంలో మరిన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో గ్రంథాలయ మెంబర్ ఇన్‌చార్జ్ , లైబ్రరీ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ రాధికారాణి రెలవెన్స్ ఆఫ్ రంగనాథన్ ఇన్‌ది ఏజ్ ఆఫ్ ఏఐ అంశంపై ,గ్రంథాలయ విశ్రాంత ఆచార్యులు కె.రమణయ్య రోల్ ఆఫ్ లైబ్రేరియన్స్ ఇది డిజిటల్ ఎరా అంశాలపై కీలకపోన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఐఎస్సీ విభాగం మొదటి ర్యాంకర్ విద్యార్థిని నందిగామ భాగ్యలక్ష్మికి అతిథులు బంగారు పతకం అందజేశారు. హనుమకొండ ప్రభుత్వ జూనియర్‌కాలేజీ లైబ్రేరియన్ డాక్టర్ జి.రాజ్‌కుమార్‌ని ఉత్తమ లైబ్రేరియన్‌గా అవార్డుతో సన్మానించారు. ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ విద్యార్థిని హరిప్రియకు ఉత్తమ చదువరి అవార్డును అందజేశారు. ఎంఎల్ఐఎస్సీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. తొలుత రంగనాథన్ చిత్రపటానికి వీసీ పూల మాల వేసి నివాళులర్పించారు.

విద్యారణ్యపురి : విద్యార్థులు పుస్తకపఠనంపై ఆసక్తిని పెంపొందించుకోవాలని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి చంద్రమౌళి అన్నారు. మంగళవారం వడ్డేపల్లిలోని పింగిళి కళాశాలలో రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నీటమునిగిన రేషన్ షాపు

ఖిలా వరంగల్ : సోమవారం అర్ధరాత్రి భారీ వర్షానికి వరంగల్ ఎల్‌బీనగర్ హిందూ శ్మశాన వాటిక రోడ్డులోని 4317034 షాపులోకి వరదనీరు భారీగా చేరింది. దీంతో నాలుగు నెలలుగా నిల్వ ఉన్న 58.08 క్వింటాళ్ల దొడ్డు బియ్యం, పంపిణీ చేయగా మిగిలిన 4.16 క్వింటాళ్ల సన్నబియ్యం పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. 21వ డివిజన్ కార్పొరేటర్ ఎండి.ఫుర్కాన్ మంగళవారం మధ్యాహ్నం రేషన్ షాపును సందర్శించారు. స్థానికులతో కలిసి తడిసిన రేషన్ బియ్యంను పరిశీలించారు.

ఎమ్మెల్యే సహకారంతో సంక్షేమ పథకాలు

కాజీపేట : డివిజన్ ప్రజలు అందించిన అవకాశంతో పాటు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతున్నట్లు కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ అన్నారు. 62వ డివిజన్ సోమిడి పోచమ్మతల్లి ఆలయానికి వెళ్లే రహదారిలో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు.

పలువురు రైల్వే అధికారులకు పదోన్నతులు

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ కేంద్రంగా వివిధ విభాగాల్లో పని చేస్తున్న రైల్వే అధికారులకు పదోన్నతులు లభించాయి. ఆయా రైల్వే అధికారులను పదోన్నతులపై సికింద్రాబాద్ అధికారులు వేరే ప్రాంతాలకు బదిలీపై పంపించినట్లు మంగళవారం స్థానిక రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో ఏడీఈఈగా పని చేస్తున్న ఫణికుమార్‌ను డీఈఈ పదోన్నతిపై నాందేడ్ డివిజన్‌కు ఆర్ఎస్ఓ డిపార్ట్‌మెంట్‌కు బదిలీపై పంపించినట్లు తెలిపారు. అదేవిధంగా కాజీపేట రైల్వే సెంట్రల్ విభాగంలో కాజీపేట-ఘన్‌పూర్ సెక్షన్‌లో ఏపీడబ్ల్యూగా పని చేస్తున్న బి.రజనీకాంత్‌ను సికింద్రాబాద్ అధికారులు పదోన్నతిపై మంచిర్యాల పిడబ్ల్యూఐగా బదిలీపై పంపించినట్లు తెలిపారు.

చెరువులు, కుంటల వద్దకు వెళ్లొద్దు

మడికొండ: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కుంటలు, చెరువులు నిండిపోయాయి. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలోని చెరువులను మంగళవా రం సీఐ కిషన్, ఎస్సై రాజ్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులు, కుంటల పరిసర ప్రాంతాలకు ప్రజలు ఎవరూ వెళ్లకూడదని పేర్కొన్నారు. ఏమైనా ఇబ్బందులు ఎదురైతే 871268 5009, 8712685248 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ కిషన్‌సూచించారు.